వెళ్ళి యేదో చెబితే వింటారు. అయ్యో పాపం అననూ అంటారు. కాని వెంటనే ఆ వేపు యెక్కడో చూస్తూ ఎవరినో గట్టిగా కేక వేస్తారు. యింతటితో యీ ప్రపంచంనుండి తప్పించుకొని మరే విషయంమీదనో సంభాషణ తిరిగిపోతుంది.

అసలు బాధలంటే మనిషికి బ్రహ్మాండమైన భయం కావచ్చు? తనవే కాదు, మరెవరివైనా అతను వినడానికి తనకు వీలయినంతలో ఒప్పుకోడు. తప్పించుకోనేందుకే సర్వేసర్వత్రా తంటాలు పడతాడు.

లోతుల్లోకి చూస్తే అతనికళ్లు తిరుగుతాయి. కాబట్టే అతను ఆకసంవేపు చూస్తాడు. లేదా గట్టిగా కళ్లు మూసుకుంటాడు. గాయపడిన గుండె నెత్తురు కార్చకపోతే పన్నీరెలా వెదజల్లుతుంది. ఈసంగతతనికి తెలుసు. నెత్తురు చూస్తే అతనికళ్లు చీకట్లుపడిపోతాయని భయభ్రాంతుడవుతాడు.

ఎటుచూచినా రోదనం, ఎటువిన్నా బాధలు, ఎటువెళ్ళినా కూలినకొంపలు కనిపిస్తుండగా అతను గిలగిల లాడుతున్నాడు. తన హృదయంలోపలి పొరలలో చూచుకున్నప్పుడు, నిజాయితీకల మనిషి నరకయాతనను అనుభవించవలసి వస్తుంది. ఒక్క సానుభూతి మాటే గదా అని నోరు జారాడా తనలో యేదో భూకంపం, మహాప్రళయం జరిగినంత పనవుతుంది.

ఒక్క కరుణానినాదం కోసంటూ విన్నాడా తను నీరుగారిపోవలసి వస్తుంది. అది తన కిష్టం లేదు. హాయిగా నిద్రపోవాలంటే యీ క్రూర ప్రపంచంలో ఆత్మవంచనే శరణ్యమవుతున్నది. లేదా తానూ బాధపడాలి. ఈ బాధలగూర్చి ఆలోచించాలి. ఆ ఆలోచనలో పడ్డాడా ఇక నిద్రపట్టదు. కానీ అతనందుకు సిద్ధంగా లేడు.

ఆలోచించే అపేక్ష అందరికీ వుండదు కాబట్టే, ఆశ్వసించాలన్న ఔత్సుక్యం అందరికీ వుండదు కాబట్టే యింకా దేశంలో సుఖంగా నిద్రపోయేవారున్నారు.

అందువల్లనే

‘అయ్యో రామ’ అనే మాట కోసం తపించేవారూ వుంటున్నారు.

ఏమిటో మనుషులు, వీరిని చూచి ఏడవాలో నవ్వాలో తెలీదు. ఎంత భయస్తులు.

‘అయ్యో పాపం.’

కథానిక

# తీరిపోయిన బాకీ

"సులోచన"

“ఏమండీ, విశ్వనాథంగారూ. నమస్కారం!”

అంటూ గడప దాటి లోపలకొచ్చాడు రామబ్రహ్మం.

ప్రతినమస్కారంచేసి, ఆ వచ్చిన వ్యక్తితో తనకి సంబంధం అట్టే లేదన్నట్టు తన పనిలో తాను నిమగ్నుడయ్యాడు విశ్వనాథం.

రామబ్రహ్మం ప్రక్కన ఖాళీగా ఉన్న కుర్చీలో నిండుగా చతికిలపడి, చిన్న దగ్గుదగ్గి “చూడండీ! ఏదో పనిలోఉన్నట్టున్నారు. క్షమించండి! నా విషయం ఏంచేశారు? ఆర్డరు వేయించి ప్రెసిడెంటు గారిచేత సంతకం పెట్టించారా?” అన్నాడు.

విసుగ్గా తలెత్తి, అసహ్యంగా ఒక్క చూపు చూసి, ఈ వెట్టి చాకిరీ అంతా యెవరు చేస్తారన్నట్టు, మళ్లీ తలదించుకొని ఏదో వ్రాసుకుంటున్నాడు, హెడ్‌క్లర్కు విశ్వనాథం. రామబ్రహ్మానికి శరీరంనిండా జెర్రులు ప్రాకినట్లయింది. కొంచెంసేపు సేద తీర్చుకున్న తరువాతకూడా, తనకంటె వెనుకవచ్చిన ముగ్గురు పెద్దమనుషులతో హాయిగా మాట్లాడినతరువాత కూడా, విశ్వనాథం తనకేసి చూపకపోవటంలో గల అంతరార్థం బోధపడింది రామబ్రహ్మానికి. విశ్వనాథం తననుంచి అందరిలాగానే లంచం కోరుతున్నాడు. తను చాలా నియమాలు కల మనిషనీ, దేహి అన్నవాడికికూడా కానీ చేత్తో

యిచ్చే ఆచారం లేదనీ విశ్వనాథానికేం తెలుస్తుంది?

"ఏమండీ! విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారే!" అన్నాడు రామబ్రహ్మం.

"పని చెయ్యక పోతే పొట్ట గడిచేదెట్లా?" తల పైకి ఎత్తకుండానే అన్నాడు విశ్వనాథం

"కాస్త అలా వెళ్ళి కాఫీ త్రాగివద్దాం రండి." అన్నాడు రామబ్రహ్మం. చాలామంది ఆయనకు ఈవంక మీదే లంచాలు ముట్టచెబుతూ వుంటారు. నిముషం సేపు ఆలోచించి "సరే, వెళదాం పదండి! వేళకూడా అయినట్టుంది" అని లేచాడు విశ్వనాథం. మనిషిలో ఆ విసుగు ఏమైంది?

ఇద్దరూ హోటలుకు వచ్చారు. ఈ లోపున రామబ్రహ్మం ఆ విషయమూ ఈ విషయమూ అడిగి పరిచయం కాస్త జాస్తీ చేసుకున్నాడు. కాఫీ త్రాగినతరువాత, సర్వర్ యిచ్చిన బిల్లు తన వద్దనే ఉంచుకొని,

"విశ్వనాథంగారూ! మీరు అన్యథా భావించకుండా, ఈపది రూపాయలూ పుచ్చుకొని, నా పని త్వరగా అయేట్టు చూడండి" అని పది రూపాయలు ఇచ్చాడు రామబ్రహ్మం.

విశ్వనాథం నవ్వుతూ "ఆఁ ఇటువంటి లంచాలు నాకు గిట్టవండీ. ఇహ ఏదో మీరు పరిచయపూర్వకంగా యిస్తూంటే" అంటూ ఆ నోటును జేబులో కుక్కుకున్నారు.

ఎక్కడో ఏ మూలనో చిత్తు కాగితాల క్రింద దుమ్ములో మట్టి కొట్టుకున్న రామబ్రహ్మం ఉద్యోగంకోరకు దాఖలు చేసుకున్న అప్లికేషన్ను విశ్వనాథం వెతికి, దుమ్ముదులిపి, ఆర్డరు వేయించి-పైపు తానే కొట్టి, ప్రెసిడెంటుగారిచేత సంతకం పెట్టించి, సాయంత్రానికి ఆర్డరు కాగితం రామబ్రహ్మానికిచ్చేడు.

* * *

ఒకనాడు సాయంత్రం ఆఫీసునుంచి విశ్వనాథం రోడ్డుకు కుడి ప్రక్కగా తలవంచుకొని యేదో ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు. ఇంతలో వెనుకనుంచి ఎవరో పిలుస్తున్నట్టు వినిపించి ఆగాడు. రామబ్రహ్మం త్వరగా పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ వస్తున్నాడు. ఇంకా తనతో ఏంపనో అర్థంకాలేదు విశ్వనాథానికి.

"బాగున్నారా?" అన్నాడు రామబ్రహ్మం

"ఆఁ!"

ఎంత దూరంనుంచి వస్తున్నాడో ఆలసిఉన్నాడు రామబ్రహ్మం. చెమట కారుతున్నది. పై పంచతో విసురుకుంటున్నాడు.

"కాస్త హోటల్లోకిపోదాం పదండి. అటు కాఫీ త్రాగినట్టవుతుందీ, ఇటు విశ్రాంతి తీసుకోవచ్చు!" అని విశ్వనాథాన్ని హోటలుకు తీసుకెళ్ళాడు రామబ్రహ్మం

ఇద్దరూ కాఫీ త్రాగారు. కొంచెంసేపు క్షేమ సమాచారాలు మాట్లాడుతున్నారు. మెల్లగా విశ్వనాథంతో ఇలా అన్నాడు రామబ్రహ్మం.

"ఏమండీ విశ్వనాథంగరూ! నాకొక్క సహాయం చేయాలి."

"ఏం సహాయం?"

"చేస్తానని మీరు ఒప్పుకొంటే చెబుతాను. అంతగొప్ప దేమీకాదు లెండి. మీ ఋణం వుంచుకోను."

"సరే."

"ఇప్పుడు అవసరంగా పదిరూపాయలు సర్దాలి. అతి ముఖ్యమైన కార్యం డబ్బులేక ఆగిపోయింది" అన్నాడు రామబ్రహ్మం. ఎందుకనో యిదంతా నటనగా తోచింది విశ్వనాథానికి. ఐనా క్రిందటి పరిచయాన్నిబట్టి వెంటనే పది రూపాయలు జేబులోంచి తీసి యిచ్చాడు.

ఆ రూపాయలు అందుకొని "అభివందనాలు" తెలిపి పోయాడు రామబ్రహ్మం.

డ్రాయరుమీద బిల్లుపడింది. అది తీసుకు వెళ్ళి చెల్లించటం రామబ్రహ్మం మరచిపోయి ఉంటాడో, లేక విశ్వనాథం చెల్లించగలడని వెళ్లాడో తెలీదు. ఏమైనా విశ్వనాథానికి తప్పలేదు.

* * *

మరి కొన్ని రోజుల అనంతరం విశ్వనాథానికి రామబ్రహ్మం ఒక రోజు సినిమా హాల్లో కనపడ్డాడు. విశ్వనాథాన్ని చూసి కూడా చూడనట్టు నటించాడు రామబ్రహ్మం. తనను చూసి, తనకు పది రూపాయల బాకీ యివ్వవలసి వుండి కూడా అలా తప్పించుకోవటం అర్థం కాలేదు విశ్వనాథానికి.

దగ్గరకు వెళ్ళి "రామబ్రహ్మంగారూ!

బాగున్నారా?" అన్నాడు విశ్వనాథం.

"ఆఁ!" అన్నాడు రామబ్రహ్మం.

"ఇంటర్ వెల్ యేగా. కాస్త అలారండి. టీ త్రాగి వద్దాం" అంటూ విశ్వనాథం "ఎందుకు లెండి" అని అంటూన్న రామబ్రహ్మాన్ని టీ స్టాల్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

ఇద్దరూ టీ త్రాగారు. డబ్బులు విశ్వనాథమే యిచ్చాడు. "ఇదిగో చూడండీ రామబ్రహ్మంగారూ! ఆవేళ హోటలులో తీసుకెళ్లిన పది రూపాయల బాకీ యింత వరకు చెల్లించనే లేదు" అన్నాడు విశ్వనాథం.

"నిజమాలోచిస్తే మీకు నేను బాకీఇవ్వాల్సి లేదను కుంటాను. ఎట్లాగంటారా? మొదట నేను మీకు పరిచయపూర్వకంగా పది రూపాయలు ఇచ్చాను. జ్ఞాపకం తెచ్చుకోండి! తరువాత ఆ డబ్బు నేను మీవద్దనుండి తీసుకున్నా. ఇందులో మీకు నేను చెల్లించవలసిన బాకీలేదే" అన్నాడు రామబ్రహ్మం.

కథానిక

# శిక్ష వేసిన బిచ్చగాడు

"శివశ్రీ"

బిచ్చగాని గొంతుక నుండి బయల్వెడలిన శ్రావ్యసంగీతం అప్పుడే పెట్టెలోకి తోసుకు తోసుకు ఎక్కిన మనుష్యులకు కొంత హాయిని కల్పించింది. పెట్టె నిండా ఎక్కడి కక్కడ జనం నిలబడి ఉండటం వలన బిచ్చగాడు చాల మందికి కనపడటం లేదు. కాని తన సంగీతం ద్వారా అందరి హృదయాల చేరువకు రాగలిగాడు ఒక్క క్షణంలో. అతని సంగీతం ఒక్కొక్కరిలో ఒక్కొక్క భావాన్ని రేకెత్తిస్తోంది.

శాంత మధూలు కూడా ఆ పెట్టెలోనే ప్రయాణం చేస్తున్నారు. శాంత బిచ్చగాని సంగీతం వలన ఆమె జీవితంలోని చిన్నతనపు రోజుల లోనికి తీసుకొని పోబడింది. ఆమె అయిదవ ఫారం చదువుతూండగా ఆతరగతిలో సంగీతం మధురంగా పాడగల ఒక కుర్రవాని యందు ఆమె మనసు లగ్నమై వుండేది. ఆ ఆ కుర్రవాడికి సంగీతం దైవ ప్రసాదితం. సంగీతమంటే చెవికోసుకునే గుణం శాంతకు దైవ ప్రసాదితం. శాంతకు సంగీతం మీద కల అభిరుచి ఆ నిరుపేద కుర్రవాని యెడ అభిమానాన్ని కల్పించింది. అభిమానం క్రమేపీ స్నేహితంగా మారింది. స్నేహితం కొద్దిరోజుల్లోనే గాఢమైన ప్రేమగా మారిపోయింది. శాంత లేత మనస్సు అనేక సార్లు సంతృప్తి చెందింది అతని సంగీతంవల్ల. మరుసటి సంవత్సరం స్కూలు ఫైనలు తరగతిలోకి శాంత వచ్చేసరికి అతను కన్పించక పోవడం ఆశ్చర్యాన్ని కల్గించింది. ఆ కుర్రవాడూ శాంతతో పాటు అయిదవ ఫారం ఉత్తీర్ణుడయ్యాడు. శాంత హృదయంలో మారుమూలలో అతనికొక స్థానం ఏర్పడి శ్రావ్య సంగీతం విన్నప్పుడల్లా శాంతకి చిన్ననాటి స్నేహితుని జ్ఞాపకం చేస్తూ వస్తోంది.

"ఎవరికోసం ఈ బ్రతుకు" అంటూ మరో పాట మొదలెట్టాడు బిచ్చగాడు. ఆ పాట తానొక నిరాశా జీవిననే విషయాన్ని శ్రోతలకు స్పష్టంగా తెలియజేస్తోంది. నిజంగా ఒక బిచ్చగాడు ఆశాజీవి ఎట్లా కాగలడు? ప్రయాణీకుల్లో ఒకడు "ఏయ్ ఆ పాట మళ్ళీపాడు" అన్నాడు. మిగతా ప్రయాణీకులంతా ఒకసారి అతని ముఖంలోకి చూశారు, ఆ ప్రయాణీకుడు చిన్నపోయాడు. నిజానికి అతనేకాదు ఇంకా చాలమంది నిరాశా జీవులు ఆ పెట్టెలోనే ప్రయాణం చేస్తూ ఉండి ఉంటారు. కాని అతని హృదయంలో గల బాధను బహుశ్రావ్య కంఠంలో వ్యక్తంచేయగలిగాడు ఒకబిచ్చగాడు. ఆ పాట అతన్ని మైమెరపించింది. తన కోరికను వెళ్ళబుచ్చాడు. అంతే. మిగతా వాళ్లు సాంఘిక మర్యాద కాదనుకొని నోరు మెదల్పలేదు. పైగా అంతా ఆశాజీవులే అనేవిధంగా అతనివైపు ఒకేసారి చూశారు. బిచ్చగాడు ఆ ప్రయాణీకుని కోరికను మన్నించాడు. పాటపాడుకుంటూ సందు చేసుకుని ముందుకు వస్తున్నాడు.